కాంగ్రెస్ పాలనలో రైతుల కంట కన్నీరు

- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

బ్రోచర్‌ను విడుదల చేస్తున్న కోరుకంటి చందర్

గోదావరిఖని, జూలై 21: మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ పాలనతో రాష్ట్రంలోని రైతులకు కంట కన్నీరే మిగిలిందని రామగుండం మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ఆరోపించారు. ఆదివారం గోదావరిఖనిలో ని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కాంగ్రెస్ పాలనపై ధ్వజమెత్తారు. రైతు రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వం అనేక ఆంక్షలు పెడుతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నదని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ రైతాంగం కళ్లలో ఆనందం నిండిందని, కాంగ్రెస్ పాలనలో రైతులకు కన్నీళ్లు మిగిలాయన్నారు. కేసీఆర్ ఇంటింటా సంక్షేమ పథకాలను విజయవంతంగా అందించగా దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఒక దిక్సూచిగా నిలిచిందన్నారు. కేసీఆర్ పాలనను నీతిఆయోగ్ అభినందించినట్లు గుర్తు చేశారు. ఏకకాలంలో రుణమాఫీ చేసిన కేసీఆర్ ప్రపంచం అబ్బురపడేలా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేశారన్నారు. కాంట్రాక్టు నిర్లక్ష్యంతో మూడు పిల్లర్లు కుంగితే ఆ అపవాదును కేసీఆర్ మీద మోపి కాంగ్రెస్ పార్టీ లబ్ధి పొందే ప్రయత్నాలు చేసిందన్నారు. రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి ఒక రకంగా మంత్రులు ఒకరకంగా మాట్లాడుతూ, రైతులను అయోమయానికి గురిచేస్తున్నారని, కాంగ్రెస్ నాయకులు తెలంగాణ రైతాంగానికి క్షమాపణ చెప్పాలని డి మాండ్ చేశారు. విద్యుత్ కేంద్రాలకు నిలయంగా ఉన్న రామగుండం ప్రాంతంలో జెన్ కో ద్వారానే విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నట్లు తెలిపారు. ఇక్కడ సింగరేణి సంస్థ కొత్త వ్యాపారానికి తెరలేపిందని, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాల పేరుతో క్వార్టర్లు తొలగించాలని చూస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను, నిరుద్యోగులకు రూ.2లక్షల ఉద్యోగాల జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలన్నారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా పంటకు రూ.500 బోనస్ అమలు చేయాలని డిమాండ్ ఏశారు. అనంతరం పేదవారి ముఖంలో ఆనందం కోసం మేము సైతం కేటీఆర్ అన్న బాటలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. మాజీ మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా రామగుండంలోని ప్రతి డివిజన్‌లో, గ్రామంలో గిఫ్ట్ ఏ స్మైల్ కింద సేవా కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఇక్కడ కార్పొరేటర్ గాధం విజయ, నాయకులు నడిపెల్లి మురళీధర్‌రావు, అచ్చేవేణు, చల్లగురుగుల మొగిళి, పిల్లి రమేశ్, నూతి తిరుపతి, జహీద్‌పాషా, బొడ్డుపల్లి శ్రీనివాస్, చల్లా రవీందర్‌రెడ్డి, అడప శ్రీనివాస్, తోకల రమేశ్, ఓదెలు, గంపుల లక్ష్మీ, తాళ్ల శ్యాం, చింటూ, బచ్చాల రాములు, ముద్దసాని సంధ్యారెడ్డి, సట్టు శ్రీనివాస్, కనకరాజ్, యువరాజ్, వెంకటేశ్ ఉన్నారు.

ఓపెన్ కాస్ట్ నిర్వాసితులకు పరిహారం చెల్లించండి

- సింగరేణిని ఆదేశించిన మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, జూలై 21 (నమస్తే తెలంగాణ) : లగ్నాపూర్ ఓపెన్ కాస్ట్ మైన్ కోసం సింగరేణి కాలరీస్ సేకరించిన భూమిలో ఇళ్లు నిర్మించుకున్న 280 మందికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద పరహారం చెల్లింపు విషయమై లబ్ధిదారులతో చర్చలు జరపాలని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. మంథని నియోజకవర్గం రామగిరి మండలం లగ్నాపూర్‌లో సింగరేణి సంస్థ ఓపెన్‌కాస్ట్ మైన్ కోసం 2012లో 103 ఎకరాల భూమి సేకరించింది. అందులోని 466ఇళ్లకు నష్టపరిహారం, ఆర్‌అండ్‌ఆర్ కింద 721 మందికి, ఒక్కో పౌరుడికి రూ.7.5 లక్షల చొప్పున చెల్లించింది. నివాసాలు కోల్పోయినందుకు, మనుషుల పునరావాసానికి సింగరేణి మొత్తం రూ.145 కోట్లు విడుదల చేసింది. ఈ క్రతువంతా ముగిసి భూమి సింగరేణి పరమైన తర్వాత కొందరు అదే భూమిలో 1400 ఇళ్లు నిర్మించుకుని నష్టపరిహారం కోరారు. అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న శ్రీధర్‌బాబు చొరవతో వారికి రూ.30కోట్ల పరిహారం అందిచింది బొగ్గు సంస్థ. నిర్వాసితులుగా చెబుతున్న 280 మందికి ఆర్‌అండ్‌ఆర్ చెల్లింపులో చట్టపరమైన అడ్డంకులు ఉన్నాయని అధికారులు మంత్రి దృష్టికి తేగా వారందరితో మాట్లాడి మానవతా దృక్పథంతో పరిహారం అందించి సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో సింగరేణి సీఎండీ నేనావత్ బలరామ్, పెద్దపల్లి కలెక్టర్ శ్రీహర్ష కోయా, మంథని ఆర్డీవో హనుమానాయక్, సింగరేణి ఆపరేషన్స్ డైరెక్టర్ ఎన్వీకే శ్రీనివాస్, డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ జీవీరెడ్డి, రామగుండం-3 జీఎంఎన్ సుధాకర్‌రావు, జీఎం ఎస్టేట్స్ వెంకటయ్య, ఎస్టేట్ ఆఫీసర్ ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

వీడని ముసురు

- జిల్లాలో 42.9 మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదు
- ఉధ్రుతంగా ప్రవహిస్తున్న వాగులు

పెద్దపల్లి: శిథిలావస్థలో ఉన్న ఇంటిని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్

పెద్దపల్లి రూరల్: కొత్తపల్లి-దస్తగిరిపల్లి గ్రామాల మధ్య వాగు వద్ద వరదను పరిశీలిస్తున్న ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ కృష్ణ, ఎస్ఐ లక్ష్మణ్‌రావు

మంథని: ఇల్లు కూలిన బాధితురాలిని పరామర్శిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమా సురేష్‌రెడ్డి

పెద్దపల్లి, జూలై21(నమస్తే తెలంగాణ): జిల్లాను ముసురు వీడడం లేదు. జిల్లా వ్యాప్తంగా నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. వరదలకు వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. చెరువులు, కుంటలు నిండాయి. ఆదివారం జిల్లాలో సరాసరి వర్షాపాతం 42.9 మిల్లీమీటర్లు కాగా, అత్యధికంగా ధర్మారంలో 56.7 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. పాలకుర్తిలో 49.6, అంతర్గాంలో 40.1, రామగుండంలో 37.1, రామగిరిలో 24.7, కమాన్‌పూర్‌లో 40.5, పెద్దపల్లి లో 45.0, జూలపల్లిలో 47.0, ఎలిగేడులో 43.5, సుల్తానాబాద్‌లో 38.9, ఓదెలలో 41.9, కాల్వ శ్రీరాంపూర్‌లో 39.0, ముత్తారంలో 48.5, మంథనిలో 48.4మిల్లీమీటర్ల వరాపాతం నమోదైంది. ఎగువ నుంచి జిల్లా పరిధిలోని గోదావరి నదిలోకి భారీగా వరద నీరు 27,981క్యూసెక్కులు, కడెం ప్రాజెక్ట్ నుంచి 14,333 క్యూసెక్కులు కాగా మొత్తంగా 42,314 క్యూసెక్కుల నీరు ఎల్లింపల్లికి వస్తుంది. దీంతో ప్రాజెక్ట్ నిల్వ సామర్థ్యం 20.17 టీఎంసీ కాగా, 7.87 టీఎంసీల నీరు వచ్చి చేరింది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పెద్దపల్లి, జూలై 21: ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ కోరారు. 12,16, 32, వార్డుల్లో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను, మినీ ట్యాంక్ బండ్‌ను ఆదివారం మున్సిపల్ రిస్క్ టీం సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. ఎడతెరిపిలేని వర్షాలతో పట్టణంలో ఇప్పటివరకు ఒక ఇళ్లు, రెండు చోట్ల ప్రహరీలు కూలిపోయాయని తెలిపారు. ఏమైనా సమస్యలుంటే టోల్‌ఫ్రీ నంబర్ 63031274 84 ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాజాం మహంత కృష్ణ, జూనియర్ అసిస్టెంట్ దేవానంది రమాకాంత్ రిస్క్ టీం సభ్యులు బండి అనిల్, లక్ష్మీ నర్సయ్య, అనాసి శ్రీకాంత్, శంకర్, సింగారపు శ్రీనివా స్, జగత సత్యం, వేముల సుధాకర్, శానిటేషన్ జవాన్ వేణు పాల్గొన్నారు.

గౌరీగుండాల సందర్శనకు రావొద్దు

పెద్దపల్లి రూరల్, జూలై 21: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల పెద్దపల్లి సబ్ డివిజన్ పరిధిలో ప్రజలు ఎక్కడ కూడా ఇబ్బందులు పడకుండా పోలీసు శాఖా పరంగా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ అన్నారు. వరదల ఉధృతి ప్రభావం తగ్గేవరకు సబ్బితం గట్టు సింగారం గౌరీ గుండాల జలపాతం సందర్శనకు ఎవరూ రావొద్దని తెలిపారు. పెద్దపల్లి మండలంలోని కొత్తపల్లి-దస్తగిరిపల్లి గ్రామాల మధ్యగల వాగుపై వస్తున్న వరద పరిస్థితిని ఏసీపీ, సీఐ, ఎస్ఐ పరిశీలించారు. సబ్బితం నుంచి గట్టు సింగారం గౌరీ గుండాల జలపాతం సందర్శనకు ఎవరూ రావొద్దని హెచ్చరిస్తూ నిషేధాజ్ఞలు విధిస్తూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఏసీపీ వెంట పెద్దపల్లి సీఐ కృష్ణ, పెద్దపల్లి, బసంత్‌నగర్ ఎస్ఐలు లక్ష్మణ్‌రావు, స్వామి ఉన్నారు.

కాల్వశ్రీరాంపూర్ : హుస్సేన్‌మియా వాగు ఉధృతి

గూడు కోల్పోయిన అక్కాచెల్లెళ్లు

మంథని, జూలై 21: వర్షానికి ఇద్దరు అక్కా చెల్లెళ్లు గూడు కోల్పోయారు. మంథని మున్సిపాలిటీ పరిధిలోని బోయినిపేట(తెనుగుగూడెం)లోని వారి నివాసంలో అక్కాచెల్లెళ్లు కుంట సమ్మక్క, సందీప ఇద్దరు నివసిస్తున్నారు. తల్లిదండ్రులు లేకపోవడంతో ఇద్దరు కూలీ పనులు చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నారు. వర్షాలతో పాత పెంకుటిళ్లు కావడంతో ఆదివారం తెల్లవారుజామున కూలి పోయింది. ఇళ్లు బాగాలేదని ఇద్దరు రాత్రి పక్కన ఉన్న బంధువుల ఇంట్లో పడుకోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఇంట్లో ఉన్న వంట సామాగ్రి, ఇతర వస్తువులు ధ్వంసమయ్యాయి. తమకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని అక్కాచెల్లెళ్లు కోరుతున్నారు. తహసీల్దార్ రాజయ్య డీటీ గిరిప్రసాద్, ఆర్ఐ త్రివేణిల ద్వారా 25కిలోల బియ్యం, వారం రోజులకు సరిపడా నిత్యావసర సరుకులను అందించారు. బోయినిపేటలో కూలిన ఇల్లును మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమా సురేశ్‌రెడ్డి సైతం సందర్శించి సమ్మక్క, సందీపను ఓదార్చారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

పెద్దపల్లి, జూలై 21: జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలతో జిల్లాలోని పొంగుతున్న వాగులు, నిండిన వద్ద చెరువుల వల్ల ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. భారీ వర్షాల కారణంగా ప్రాణనష్టం జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, కూలిపోయే ఇళ్లలో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు.ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకు జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, అత్యవసర పరిస్థితుల్లో కంట్రోల్ రూమ్ నెంబర్ 18005995459, +91 80084 69511లో సంప్రదించాలని కలెక్టర్ కోరారు.

ఉప్పొంగిన మానేరు, హుస్సేన్‌మియావాగు

కాల్వశ్రీరాంపూర్, జూలై 21 : మండలంలో మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షానికి చిన్నరాత్‌పల్లి-పెద్దరాత్‌పల్లి గ్రామాల మధ్యన హుస్సేన్‌మియా వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. మానేరు, హుస్సేన్‌మియా వాగు ఉప్పొంగడంతో పరివాహక ప్రాంత గ్రామాలైన చిన్నరాత్‌పల్లి, మొట్లపల్లి, పెద్దరాత్‌పల్లి గ్రామాల్లోని రైతులు పొలాల వద్దకు వెళ్లి తిరిగి తొందరగా ఇండ్లకు చేరుకోవాలని అధికారులు కోరారు. పరివాహక ప్రాంత గ్రామాల రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జాహెద్‌పాషా ఒక ప్రకటనలో కోరారు.

స్తంభించిన జనజీవనం

ధర్మారం, జూలై 21: ధర్మారం మండలంలో వర్షంతో జనజీవనం స్థంభించింది. మండలంలో 61.4 మి.మీ వర్షంకు రిసింది. అత్యవసర పనులకు మినహా జనం ఇండ్ల నుంచి బయటకు రాలేదు.

బాధిత కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

వెంకటేశ్వర్లు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

రామగిరి, జూలై 21 : ఇటీవల సింగరేణి ఓసీపీ-2లో గని ప్రమాదంలో మృతి చెందిన ఉప్పు వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పరామర్శించారు. ముందుగా వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. కొత్తగా గెలిచిన యూనియన్ నాయకులు తన భర్తను వేధింపులకు గురి చేస్తున్నారని గడిచిన రెండు నెలలుగా బాధపడుతూ చెబుతుండేవాడని అతని భార్య వాపోయింది. తమ తండ్రి మృతికి అధికారుల వేధింపులు, రక్షణ చర్యలు చేపట్టకుండా ఆ పనులు చేయించడమే కారణమని కుమారులు రోదిస్తూ తెలిపారు. తమకు న్యాయం చేయాలని కోరగా బీఆర్ఎస్ పక్షాన అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వారి వెంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పూదరి సత్యనారాయణ, మండలాధ్యక్షుడు శంకేసి రవీందర్, పట్టణాధ్యక్షుడు కాపురబోయిన భాస్కర్, మాజీ ఎంపీటీసీ ధర్మల రాజసంపత్, వేముల రవిశంకర్, నాయకులు దేవ శ్రీనివాస్, వేగోలపు మల్లయ్య, సత్యరెడ్డి, కిరణ్, ఉదయ్, మట్ట రాజు తదితరులు పాల్గొన్నారు.

'కోట' కుటుంబానికి అండగా బీఆర్ఎస్

- పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

సమ్మయ్యగౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లి/పెద్దపల్లి టౌన్, జూలై 21: పెద్దపల్లి పట్టణంలోని తిలక్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు కోట సమ్మయ్యగౌడ్ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సమ్మయ్యగౌడ్ నివాసంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ పటిష్టం కోసం సమ్మయ్యగౌడ్ అహర్నిలు కృషి చేశాడని తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సబ్యులకు రూ.50 వేలు అందించారు. డాక్టర్ దాసరి మమతారెడ్డి, పట్టణాధ్యక్షుడు ఉప్పు రాజుకుమార్, కౌన్సిలర్ నాంసాని సరేశ్‌బాబు, కుటుంబ సభ్యులు, స్నేహితులున్నారు. ఇక్కడ మాజీ జడ్పీటీసీ గోపగాని సారయ్యగౌడ్, నాయకులు సింగం సత్తయ్యగౌడ్, కోలా లక్ష్మణ్, బాలసాని వెంటేశం, గుర్రం సదానందం, సురేందర్, మెట్టు సమ్మయ్యగౌడ్, పిల్లి రమేశ్‌గౌడ్, తదితరులున్నారు. అలాగే, సమ్మయ్యగౌడ్‌కు పెద్దపల్లి గీత పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు నివాళులర్పించారు.

విశ్వభారతికి అచీవ్‌మెంట్ అవార్డులు

యాదగిరిగౌడ్ తిరుపతిగౌడ్

జ్యోతినగర్, జూలై 21: ఎన్టీపీసీలోని విశ్వభారతి విద్యాసంస్థలు 32 ఏళ్లుగా విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తున్నందుకు గురుపౌర్ణమి సందర్భంగా విశ్వభారతి విద్యాసంస్థల చైర్మన్ బందారపు యాదగిరిగౌడ్‌కు ఎమరాల్డ్ అచీవ్‌మెంట్ అవార్డు, హెచ్ఎం తిరుపతిగౌడ్‌కు గోల్డ్‌లోన్ అచీవ్‌మెంట్ అవార్డులను అందజేస్తున్నట్లు నేషనల్ సెమ్స్ ఒలింపియాడ్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ కన్వీనర్ అరుకాల రామచంద్రారెడ్డి, కో కన్వీనర్ ఎస్ఎన్ రెడ్డి, ట్రస్మ రాష్ట్ర అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి ప్రకటించారు. సెమ్స్ 5వ జాతీయ అవార్డుల వేడుకను పురస్కరించుకొని అచీవ్‌మెంట్ అవార్డులతో వీరిని సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. విశ్వభారతి విద్యాసంస్థల అధినేతలకు ఈ పురస్కారాలు రావడంపై పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా గంగమ్మ తల్లికి బోనాలు

మంథని: గంగమ్మతల్లి శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

మంథని, జూలై 21: మంథనిలో గంగపుత్రుల ఆరాధ్య దైవం గంగమ్మ తల్లికి మంథని గంగపుత్ర(బెస్త) సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ తల్లి బోనాల జాతరను ఆదివారం వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని గంగపుత్రులు ఉదయాన్నే పోచమ్మ తల్లికి మొక్కులు సమర్పించారు. పట్టణంలోని బోయినపేట నాగులమ్మ ఆలయం వద్ద గంగమ్మ తల్లిని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉంచి వలలు, చేపల బుట్టీలు, మహిళలు బోనాలను ఎత్తుకొని గోదావరి తీరానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారి పట్నం వేసి, గంగమ్మ తల్లికి పుష్పాలు, పత్రాలు, చీర సారెలను సమర్పించారు. అమ్మవారిని అందంగా అలంకరించి ప్రవహించే మంథని గౌతమీ గోదావరి తీరంలో నిమజ్జనం చేసి భోజన తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం నాయకులు అంకరి కుమార్, గంధం వెంకటస్వామి, అంబటి సతీశ్, అంకరి ప్రకాశ్, అంకరి శివ, బోయిని నారాయణ, అంబటి కుమార్, అంబటి సురేశ్, అంబటి నర్సింగ్, మోసం శంకర్, మోసం నర్సయ్య, కోటేశ్, గంగపుత్రులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంక్షేమానికి కృషి చేయాలి

మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్, జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్

పెద్దపల్లి, జూలై21: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్ కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ, ఈనెల 23 నుంచి జరగబోయే తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమంపై చర్చించి ఉద్యమకారుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. ఉద్యమకారులను గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూనె రాజేశం, పార్లమెంట్ కన్వీనర్ బత్తుల శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పుల గట్టయ్య, జిల్లా మహిళాధ్యక్షురాలు దుబ్బేటి చంద్రకళ, ఉపాధ్యక్షుడు మంద భాస్కర్, కార్యదర్శి కళాధర్ రెడ్డి, శారద, లక్ష్మి, భారతి, నరసక్క, రౌతు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శాకాంబరీ ఉత్సవం

మంథని, జూలై 21: మంథనిలో మహిమానిత శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఆదివారం శాకాంబరీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని అన్ని రకాల కూరగాయలతో శాకంబరి మాతగా ఆలకరించారు. అమ్మవారికి అభిషేకం, అర్చనలు, శ్రీచక్రానికి ప్రత్యేక పూ జలు నిర్వహించారు. మహిళలంతా సామూహిక శ్రీలలితా సహస్రనామ పారాయణం చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మాదిగలను అణచివేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

- మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు
- పెద్దపల్లిలో మాదిగ శక్తి సదస్సు

మాట్లాడుతున్న మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు

పెద్దపల్లి టౌన్, జూలై 21: తెలంగాణ రాష్ట్రంలో మాదిగలను రాజకీయంగా సీఎం రేవంత్‌రెడ్డి అణచివేస్తున్నాడని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని అమర్‌చంద్ కల్యాణ మండపంలో మాదిగ శక్తి సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి 80 లక్షల జనాభా కల్గిన మాదిగలు కష్టపడితే దీనికి ప్రతిఫలంగా రేవంత్‌రెడ్డి మాదిగలను రాజకీయంగా అణచివేస్తూ వారికి రావాల్సిన వాటా దక్కకుండా అడ్డుకుంటున్నాడని మండిపడ్డారు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ చింతకింది కాశీం మాట్లాడుతూ, పెద్దపల్లి పట్టణ కేంద్రంలో ఒకేరోజు మాదిగ సామాజిక వర్గం నుంచి రెండు పోటీ కార్యక్రమాలు నిర్వహిచడం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగి ఉన్నయో మాదిగలు గుర్తించాలన్నారు. ఇక్కడ నాయకులు తెలంగాణ ఉద్యమ నాయకుడు విఠల్, హైకోర్టు న్యాయవాది శతర్‌కుమార్, మాదిగశక్తి వ్యస్థాపక అధ్యక్షుడు బొంకూరి సురేందర్, ప్రధాన కార్యదర్శి పినపాటి రజినీ, జిల్లా అధ్యక్షుడు కల్లేపల్లి రవి, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు నాగుల కిరణ బాబు, నాయకులు తాళ్లపల్లి అంజయ్య, రమేశ్, బానోత్ సంజీవ్, కొమ్ము ప్రవీణ్, మడిపల్లి మెగిలి, బొటుకు రమేశ్‌బాబు, అక్కపాక తిరుపతి, డాక్టర్ శరత్‌బాబు, వివేక్‌పటేల్, రమేశ్, మీసాల సాయిలు, దీపక్ పాల్గొన్నారు.

మహనీయుల ఆశయ సాధనకు పాటుపడాలి

- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి టౌన్, జూలై 21: మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరణారావు కోరారు. ఆదివారం ఆర్‌కే గార్డెన్‌లో ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఒక్కరోజు శిక్షణ తరగతి నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, మాట్లాడారు. అంబేడ్కర్ ఎంతో ముందు చూపుతో రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్ ద్వారానే తెలంగాణ స్వరాష్ట్రం సాధించుకోగలిగామని అన్నారు. అంబేడ్కర్, మహాత్మజ్యోతిరావు పూలే లాంటి మహానుభావుల ఆశయ సాధన కోసం సంఘాలు పాటుపడాలని హితవు పలికారు. ఇక్కడ తెలంగాణ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మెంబర్ లక్ష్మీనారాయణ, ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధునయ్య, జిల్లా అధ్యక్షుడు సదయ్య, శంకర్‌లాల్, ఆసంపల్లి శ్రీనివాస్, సురేందర్ పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

పెద్దపల్లి, జూలై21: రాష్ట్రంలో నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని పెద్దపల్లి జిల్లా నాయీ బ్రహ్మణ సంఘం నాయకులు ఆదివారం ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఇక్కడ నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు పరమేశ్, పట్టణాధ్యక్షుడు సురేశ్, నాయకులు రాజమల్లు, భూమయ్య, తిరుపతి, హరీశ్, చందు, తదితరులున్నారు.

ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

జూలపల్లి : కన్నం సత్యనారాయణను సన్మానిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్

పెద్దపల్లి కమాన్/కమాన్‌పూర్/రామగిరి/ జ్యోతినగర్ (రామగుండం) /జూలపల్లి, జూలై 21 : జిల్లాలోని షిర్డీ సాయిబాబా మందిరాల్లో గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. జూలపల్లిలోని రాజయోగి ఆశ్రమంలో ఆశ్రమ కార్యదర్శి కన్నం సత్యనారాయణకు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ శాలువా కప్పి సన్మానించి అభినందనలు తెలిపారు. అలాగే పాదపూజ చేసి గురుభక్తిని చాటుకున్నారు.

పెత్తనం కోసమే డబ్ల్యూటీవో సంస్థలు

గోదావరిఖని, జూలై 21: భూమి, సంపద మీద పెత్తనం వహించడం కోసం సామ్రాజ్యవాదులు ఎత్తులో భాగంగానే డబ్ల్యూటీవో లాంటి సంస్థలు ఏర్పడినట్లు ప్రొఫెసర్ కాశీం అన్నారు. తెలంగాణ రైతు సాధనసమితి ఆధ్వర్యంలో ఆదివారం గోదావరిఖని సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో జరిగిన రైతు సదస్సుకు ప్రొఫెసర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసగించారు. వ్యవసాయ నూతన వ్యతిరేక చట్టాలను వివరించారు. తెలంగ